# మమకారం

-సూరేపల్లి విజయ

"ఏవండీ, అన్నం తినండి."

"వద్దు సుధా ఆకలిలేదు మీరు తినండి!" అన్నాడు సుధాకర్.

"ఇంతాలస్యమైంది. ఆకలెందుకు లేదు? టామీ గురించేగా దిగులు నాకు మాత్రం లేదా?"

"నీకు దిగులెందుకు? ఉన్నప్పుడు ఒకటే విసుక్కున్నావుగా."

"అలా అనకండి! అప్పుడు తెలియలేదు గానీ ఇప్పుడు ప్రతీక్షణం టామీ గుర్తుకొస్తోందండి! పిల్లలు కూడా బిక్కు బిక్కుమంటున్నారు. పిల్లలతో అది పూర్తిగా కలిసిపోయేది. ఇల్లంతా తిరుగుతూ సందడిగా ఉండేది. ఇప్పుడంతా బోసి పోయింది."

"ఇప్పుడనుకుని ఏం లాభం సుధా, పంపిచేసావుగా"

ఆ మాట వినగానే గుండెల్లో ముల్లు గుచ్చుకున్నట్టే అలాగే కూర్చుండి పోయింది.

★ ★ ★

"సుధా ఏం తెచ్చానోచూడు"

చేతిలో ఉన్న కుక్కపిల్లనుచూసి అంతదూరం పరిగెత్తింది. "ఎందుకండీ? ఇప్పుడున్న సందడి చాలదని ఇప్పుడు మళ్ళీ దాన్ని తెచ్చారు. ఎవరు చేస్తారు దానికి చాకిరీ" అన్నది విసుగ్గా.

"చాలాముద్దుగా ఉంది సుధా! ఒకసారి చూడు"

"వద్దులెండి మీరే చూసుకోండి."

"అలా అనకు సుధా! నేనే చూస్తాను గానీ నేను లేనప్పుడు మాత్రం నువ్వు చూడూ; అన్నట్టు ఇది వెజిటేరియన్‌తినదు. ప్రతిరోజూ కనీసం ఎగ్ అయిన పెట్టాలి. వింటున్నావుగా."

"ఆ వింటున్నాను. పిల్లలకే రోజూ పెట్టను దానికి రోజూ ఎగ్ పెట్టాలా?"

నీవు ఎంత పెడితె అంతకి రెట్టింపు విశ్వాసం మనుషులు కూడా ఉండరలా."

★ ★ ★

"మున్నీ, చింటూ ఎంతసేపు టామీతో ఆటలు? చదువుకోరా?"

"సుధా వంటయిందా" అన్నాడు సుధాకర్.

"లేదండీ. నాకెక్కడ తీరుతుంది."

"సరే, సబ్బు పట్రా టామీకి స్నానం చేయించాలి.

సబ్బుతో రుద్ది టామీకి స్నానం చేయించేసరికి సుధాకర్‌కు నడుములు పట్టేశాయి. చక్కగా నిలపడటానికిరావటం లేదు.

"లేనిపోని తద్దినం తెచ్చుకున్నట్టయింది. క్యాంప్‌కి వెళ్ళొచ్చి రెస్ట్ తీసుకోకుండా దానికి స్నానం చేయించారు! దానితో మీకు నడుము పట్టేసింది! అందుకే వద్దన్నాను. ఎందుకూ అనవసరమయిన తంటా అనీ."


"పోనిలే సుధా! ఎందుకలా అంటావు కాసేపుంటే అదే సర్దుకుంటుంది. పిల్లలతో ఎంచక్కా కలిసి పోయింది."

"కలిసిపోవడం కాదు వాళ్ళు దానితోనే ఆడుతూంటే చదువువాళ్ళకి ఎక్కడెక్కుతుంది."

★ ★ ★

సుధ బజారుకు కూరగాయల కోసం వెళ్ళింది. రోడ్డుమీద గుంపుగా ఉన్నారు జనం. ఏదో ఏక్సిడెంట్ అయినట్టుంది. గుంపులోకి తొంగి చూసి ఆశ్చర్య పోయింది. టామీ కాలిని రక్తం కారుతూ పడి ఉంది. "అయ్యో ఇక్కడికెలా వచ్చింది. కాసేపు కుదురుగా ఉండదుకదా!" అనుకుంటు జనంలోకి తోసుకుంటు వెళ్ళి...

"రిక్షా మాట్లాడిపెట్టండి బాబూ మా కుక్క పిల్లే"



అంది అక్కడి జనం అంతా "కుక్కపిల్ల రోడ్డు దాటుతూంటె స్కూటరుదాని కాలిమీది నుండి పోయిందమ్మా. స్కూటరు ఆపకుండా వెళ్ళిపోయాడు. రక్తం బాగా పోయింది. హస్పటల్‌కు తీసుకెళ్ళండి ముందు" అంటూ రిక్షా తీసుకొచ్చారు.

సుధా వెటర్నిరీ హాస్పటల్‌కి తీసికెళ్ళి క్లీన్ చేయించి ఇంజక్షన్ ఇప్పించి తీసుకొచ్చింది.

సుధాకర్ ఇంటికి రాగానే టామీ మూలుగుతూ పడుకుంది.

"సుధా, ఏమైంది దానికి" అన్నాడు.

"అది ఉన్న చోట ఉంటుందా? రోడ్డుమీదకెళ్ళి స్కూటరు కింధ పడింది. ఇంకా నయం కాలికి మాత్రమే దెబ్బతగిలింది. సమయానికి నేను వెళ్ళానుకనుక సరిపోయింది. లేకపోతే దాని గతి ఏమయ్యేదో" అన్నది.

"అయ్యో స్కూటరు కింద పడ్డదా" అంటూ దాన్ని ఒళ్ళో పడుకోపెట్టుకుని జోకొడుతూ పడుకోబెట్టాడు.

"పిల్లలు అన్నం తిన్నారా సుధా."

"టామీ తినకపోతే వాళ్ళు కూడా తినలేదు."

"మున్నీ, ‍ ందూ! టామీకి తగ్గిపోతుందమ్మా అన్నం తినండీ" అన్నాడు.

"టామీకి బాగా నొప్పిగా ఉంది డాడీ. అందుకే మేము అన్నం తినలేదు"

రేపు "తగ్గిపోతుందిగా మీరు తినండి."

★ ★ ★

"నేను క్యాంప్‌కి ఈసారి పదిహేను రోజులదాకా వెళ్ళాలి సుధా పిల్లలకు సెలవులు కదా! మీరు ఊరెళ్ళండి."

"టామీని ఏం చేద్దాం."

"దాన్ని కూడా తీసుకెళ్ళండి."

"పిల్లలతో నేను వెళ్ళటమే కష్టం. టామీనెట్లా తీసుకెళ్ళనూ?"

"నేనిక్కడ టామీకి బాక్స్ బుక్ చేయించి మిమ్మల్ని ట్రెయిన్ ఎక్కిస్తాను. అక్కడ దిగి పోవటమేగా" అన్నాడు.

★ ★ ★

టామీనీ, సుధనూ, పిల్లలనూ ట్రయిన్ ఎక్కించి సుధాకర్ వెళ్ళిపోయాడు.

ట్రెయిన్ బయలుదేరింది. ట్రెయిన్ వరంగల్ స్టేషన్‌లో ఆగగానే సుధ టామీ దగ్గరకెళ్ళి చూసింది.

అసలే ఎండాకాలం దాహం వేస్తున్నటుంది. నాలుక బయటకు చాపుతోంది. పిల్ల దగ్గర ఉన్న వాటర్ బాటిల్‌ను తీసుకుని టామీకి తాగించి వచ్చింది.

ఎంత దాహంగా ఉందో మొత్తం తాగేసింది.

ట్రెయిన్ కదిలే టయిమయింది.

"తొందరగా వెళ్ళండమ్మా ట్రెయిన్ కదుల్తోంది" అంటున్నారెవరో తొందరగా పిల్లదగ్గరకు చేరుకుంది. పిల్లలు కూడా దాహం అంటున్నారు. బాటిల్‌లో నీళ్ళు అయిపోయాయి.

"అన్నీ టామీ తాగేసిందిరా, వచ్చే స్టేషన్‌లో తీసుకొస్తాను! కాస్సేపు ఓపిక పట్టండి" చెప్పింది.

ట్రెయిన్ ఖమ్మం చేరేసరికి సుధను ఎవరో పిలిచారు. టామీ ఉన్న బాక్స్ దగ్గరకు వెళ్ళింది. అందరూ దాని చుట్టూ ఉన్నారు. టామి తలకాయ గ్రిల్స్‌లో పడిరావటం లేదు.

"మీరు మెల్లిగా తీయండమ్మా. కొత్తకదా! మమ్మల్ని కరుస్తుంది" అన్నారు.

"నేను తీస్తూంటే దానికి నొప్పి కలిగితే నన్ను కూడా కరుస్తుంది కదా!" అంది సుధ.

"మరేం చేద్దాం?" అన్నారు.

"మీరే ఎలాగో తీయండి" చెప్పింది.

ఒకతను ఫోర్ సెప్స్ తేవడానికి వెళ్ళాడు.

సుధకు చాలా విసుగ్గాఉంది. అక్కడ పిల్లలు ఇక్కడ టామీ.

ఈలోపు టామీ తలకాయ అదే గ్రిల్స్‌నుండి తీసుకుంది.

'అమ్మయ్య' అనుకుంటూ సుధ పిల్లల దగ్గరకెళ్ళింది.

ఎలాగో విజయవాడ చేరుకున్నారు.

★ ★ ★

అన్నయ్య వాళ్ళింట్లో పిల్లలకు సెలవులు తెలియకుండానే గడిచిపోయాయి. చదువు లేకపోవడం, ఫ్రీగా ఉండడం వల్ల తిరిగి వెళ్ళటం అంటే దిగులు పట్టుకుంది.

"మళ్ళీ దసరా సెలవులకు తీసుకొస్తాను" అని చెప్పి సుధ పిల్లలతో బయలుదేరింది. టామీని అక్కడే వదిలింది.

వచ్చిన దగ్గరనుండీ అందరు ఏదో పోగొట్టుకున్న వాళ్ళలా ఉన్నారు.

పిల్లలు హుషారుగా లేరు. సుధ అసలు భోజనమే చేయటంలేదు. సుధకు అసలు ఏ పని చెయ్యాలి పించటంలేదు.

★ ★ ★

"అమ్మగారూ" అన్న పిలుపుకి ఈ లోకంలోకి వచ్చింది సుధ.

ఒక కుర్రాడి చేతిలో టామీ!

దానిని చూడగానే పోయిన ప్రాణం లేచివచ్చినట్టు అయింది.


"టామీ అక్కడ అసలు అన్నం కూడా తినడం లేదమ్మ. హుషారుగా ఉండడం లేదు. అందుకే అమ్మగారు పంపించారు" అన్నాడు.

పిల్లలు ఒక ఉదుటన టామీదగ్గరకు వచ్చారు. టామీ వచ్చి, సుధ చీర కొంగు దగ్గర కూర్చుంది.

"మా తల్లే మమ్మల్ని వదలలేక వచ్చావా?" అంటూ అక్కున చేర్చుకుంది సుధ.

వాళ్ళ మమకారాన్ని చూసి, సుధాకర్ ఆశ్చర్య పోయాడు.

ఎస్.విజయ
1-9-11/9బి/1,
అర్జునరావుపేట,
మెదక్ - 502 110




ఎన్. సుధాకర్ రావు, చంద్రశేఖరపురం, రాచర్లపాడు (పోస్ట్), కొడవలూర్ (తా), నెల్లూరు జిల్లా.